క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి


నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువులో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎస్సీ పాలెం పెద్ద ఆరేవుల పెద్ద ఏసయ్య అనారోగ్య కారణంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు, జిల్లా కార్యాచరణ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రాములు, సీనియర్ నాయకుడు ఉమామహేశ్వరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ గాలిరెడ్డి, నాయకులు వీరారెడ్డి, దానియేలు, ఆంజనేయులు, హనుమంతురావు, చిన్న, గురవయ్యలు వెళ్లి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ ఒక్క గొప్ప నాయకుడిని కోల్పోయిందన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్


డంపింగ్ యార్డును శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ రామకృష్ణ

కురిచేడు: స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా మండలంలోని కల్లూరులో గురువారం సర్పంచ్ నక్కా రామకృష్ణ డంపింగ్ యార్డును శుభ్రం చేయించారు. ఇంతకాలం నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డును జేసీబీతో శుభ్రం చేయించి ఉపయోగంలోకి తెస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. పారిశుధ్య కార్మికులు, పంచాయతీ కార్యదర్శి బాషా పాల్గొన్నారు.

మహాశివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు

త్రిపురాంతకం: త్రిపురాంతకేశ్వర స్వామి, బాల త్రిపుర సుందరి దేవి ఆలయాల్లో మహాశివ రాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆ దేవస్థానం చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి గురువారం తెలిపారు. ఈ నెల 24 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. 24వ తేదీ ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్వికరణం, పంచగవ్యప్రాశన, రాత్రి అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణలతో ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు ప్రతి రోజు స్వామివారికి విశేష పూజలు, అమ్మవారికి విశేషార్చనలు, రుద్ర హోమం జరుగుతాయని, మహా శివరాత్రి సందర్భంగా 26వ తేదీ రాత్రి లింగోద్భవకాల మహారుద్రాభిషేకం, కల్యాణ మహోత్సవం, 28వ తేదీ సాయంత్రం రథోత్సవం జరుగుతుందని, మార్చి 2వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

సచివాలయ ఉద్యోగి అదృశ్యం


జాన్ గార్డైన్ (ఫైల్)

దర్శి (కురిచేడు): మండలంలోని చందలూరు సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న దూపాటి జాన్ గార్డైన్ అదృశ్యమయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. జాన్ గార్డైన్ చందలూరు సచివాలయం విధులకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. పొద్దుపోయినా ఇంటికి రాకపోవడంతో అతని పెదనాన్న దూపాటి ఎలిషారాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జాన్ గార్డైన్‌కు ఆర్థిక సమస్యలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో మానసికంగా ఇబ్బంది పడుతూ బయటకు వెళ్లి ఉంటాడని ఆయన అనుమానం వ్యక్తం చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి పేర్కొన్నారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించండి

- మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: అత్యుత్తమ ఫలితాలు సాధించి మార్కాపురానికి మంచి పేరు తేవాలని విద్యార్థినులకు మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని రెడ్డి మహిళా కళాశాలలో వీడ్కోలు సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత 40 ఏళ్లుగా ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థినులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడం గొప్ప విషయమన్నారు. దూర ప్రాంత విద్యార్థినులకు కళాశాల ఆవరణలోనే హాస్టల్ వసతి కల్పించడం అభినందనీయమన్నారు. మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం గతేడాది మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతమ్మ, ఇంటర్మీడియెట్ ప్రిన్సిపాల్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

పశువుల మూగనోము!


తాళం వేసి ఉన్న మారెళ్ల పశువైద్యుడి గది


తాళం తీయని ఈదర పశువైద్యశాల

- ఐదేళ్లుగా అంతులేని పశువైద్యాధికారులు
- అవస్థలు పడుతున్న పశుపోషకులు

ముండ్లమూరు (కురిచేడు):

మండలంలోని ఈదర, మారెళ్ల పశువైద్యశాలల పరిధిలోని పశువులు వైద్యుల రాక కోసం మూగనోము నోస్తున్నాయి. ఐదేళ్లుగా పశువైద్యాధికారులు లేక వాటికి చికిత్స అందటం లేదు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ పేరయ్య డిప్యూటేషన్‌పై చీమకుర్తి పరిధిలోని పశువైద్యశాలకు వెళ్లారు. దీంతో ఇక్కడ ఇన్‌చార్జి వైద్యులే దిక్కయ్యారు. ఏళ్లతరబడి రెగ్యులర్ పశువైద్యులు లేక, వైద్యసేవలు అందక పశుపోషకులు పడుతున్న అవస్థలు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులకు కనిపించడం లేదు. ఈదర పశువైద్యశాలకు తాళం వేసి తీసే నాథుడే కరువయ్యాడు. ఈదర పశువైద్యశాల పరిధిలో పూరిమెట్ల, భీమవరం, బొప్పూడివారిపాలెం, కొమ్మవరం, అయోధ్యనగర్, పూరిమెట్ల గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో పశువులకు ఏ వ్యాధి వచ్చినా ఎక్కడకు వెళ్లాలో తెలియక పశుపోషకులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఎంతో వ్యయంతో వైద్య చికిత్స చేయించుకునే దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పశువైద్యశాల ఉన్నా వైద్యం చేసే నాథుడు లేకపోవటం అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్ల శని చందంగా తయారైంది పశుపోషకుల పరిస్థితి.

ఇన్‌చార్జిలే దిక్కు

ముండ్లమూరు మండలంలో మూడు పశువైద్యశాలలున్నాయి. ఈదర పశువైద్యశాలకు తూర్పుగంగవరం పశువైద్యాధికారి రాంబాబుకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. మారెళ్ల పశువైద్యశాల వైద్యాధికారి కాశిరెడ్డి సెలవుపై వెళ్లారు. దీనికి ముండ్లమూరు పశువైద్యాధికారి ఎం.విజయలక్ష్మికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ముండ్లమూరు మండలంలో 45 వేల పశువులు, 15 వేల కోళ్లు, గొర్రెలు, మేకలు వేలాదిగా ఉన్నాయి. అంతేకాకుండా పాల డైరీలు ఎక్కువగా ఉండటంతో వైద్యసేవలు ఒకచోట చేయడమే సరిపోతోంది. ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించేందుకు సమయం సరిపోవడం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద ఎక్కువగా ఉండటంతో పశుపోషకులు వైద్య చికిత్సల కోసం ఎదురుచూస్తున్నారు. పశుపోషకుల ఇబ్బందులు, మూగజీవాల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా పశువైద్యాధికారులు రెగ్యులర్ పశువైద్యాధికారులను వెంటనే నియమించాలని పశుపోషకులు కోరుతున్నారు.

> **పారా సిబ్బంది భోజనానికి వెళ్లి ఉంటారు:**
>
> ఈదర, మారెళ్ల పశువైద్యశాలల్లో సీనియర్ మోస్ట్ పారా సిబ్బంది ఉన్నారు. వైద్యాధికారులు వారానికి మూడు రోజులు మాత్రమే వస్తారు. వైద్యాధికారి ఒకరు మెడికల్ లీవులో ఉన్నారు. మరొకరు డిప్యుటేషన్‌పై వెళ్లారు. వారికి బదులుగా తూర్పుగంగవరం, ముండ్లమూరు నుంచి ఇన్‌చార్జిలను నియమించాం. పశువులకు వైద్య చికిత్స అందించేందుకు వైద్యశాలల్లో అనుభవం కలిగిన వారు ఉన్నారు.
>
> డాక్టర్ పురుషోత్తమరాజు, ఏడీ, పశుసంవర్ధక శాఖ, దర్శి

వెంకటరెడ్డికి ఎమ్మెల్యే బూచేపల్లి నివాళి


మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి (కురిచేడు): మండలంలోని పాపిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ముచ్చుమారి సుబ్బారెడ్డి కుమారుడు వెంకటరెడ్డి మృతదేహాన్ని దర్శి శాసన సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం సందర్శించి నివాళులర్పించారు. పొలంలో పనులు చేసుకునేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌తో మృతి చెందటంతో చేతికందిన కొడుకు అకాల మరణంపై సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. సుబ్బారెడ్డి కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని బూచేపల్లి మనోధైర్యం కల్పించారు.

జ్ఞాన జ్యోతిపై శిక్షణ తరగతులు


శిక్షణ తరగతుల్లో అంగన్‌వాడీలు, డీఆర్పీలు

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉమామహేశ్వరపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి కార్యక్రమంపై గురువారం శిక్షణ ఇచ్చారు. మండలంలోని 76 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణ తరగతులకు హాజరవుతున్నారు. డీఆర్పీలుగా ముండ్లమూరుకు ఎల్‌వీ ప్రసాద్, ఉమామహేశ్వరపురానికి మస్తాన్ వలి, సుశీల వ్యవహరిస్తున్నారు. మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని, ప్రాథమికంగా ఆంగ్లం, తెలుగు సులభంగా నేర్పించేందుకు శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని డీఆర్పీలు తెలిపారు. శిక్షణ తరగతులను ఎంఈఓలు జె.సుబ్బారావు, కె.వెంకటేశ్వర్లు పర్యవేక్షిస్తున్నారు. ముండ్లమూరు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్.మాధవీలత, ఉమా మహేశ్వరపురం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ సేవలు వినియోగించుకోవాలి



దొనకొండలో ర్యాలీ చేస్తున్న కెనరా బ్యాంక్ సిబ్బంది

దొనకొండ: ఖాతాదారులకు మెరుగైన సేవలు కెనరా బ్యాంక్ అందిస్తోందని, ప్రతి ఖాతాదారుడు సేవలు సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంక్ ఒంగోలు చీఫ్ మేనేజర్ ఆర్.రమేష్ తెలిపారు. మేనేజర్ జి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం బ్యాంక్ సిబ్బంది ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్.రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఖాతాదారుల డిపాజిట్లకు వడ్డీ రేటు ఎక్కువ అందిస్తోందని, అలాగే అన్ని రుణాలు, చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తోందన్నారు. 33 వేల అకౌంట్లు ఉన్నాయన్నారు. బంగారు, వ్యవసాయ రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఖాతాదారులకు అన్ని సౌకర్యాలు కల్పించిన ఘనత కెనరా బ్యాంక్‌దేనని, మండలంలోని గ్రామాల ప్రజలు సేవలు సద్వినియోగం చేసుకోవాలని రమేష్ కోరారు. బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య సిబ్బందిపై జేడీ ఆగ్రహం


సమీక్షలో మాట్లాడుతున్న జేడీ బేబీరాణి

పొదిలి రూరల్: మూగజీవాలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కె.బేబీరాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల సిబ్బందితో పశుగణన, ఆరోగ్య సంరక్షణ ప్రగతిపై జేడీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ‘చిన్న వయసులో ఉద్యోగంలోకి వచ్చారు. మూగ జీవాలకు వైద్యం చేసి ప్రజలు మన్ననలు పొందాల్సింది పోయి బాధ్యత లేకుండా వ్యవహరిస్తారా’ అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయాల వారీగా ప్రగతి నివేదిక 0 నుంచి 6 శాతమే ఉండటంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇకపై ర్యాండమ్‌గా తనిఖీలు నిర్వహిస్తానని, సెన్సస్ సర్వే రెండు రోజుల్లో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదని, సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. సమావేశంలో మూడు మండలాల సచివాలయాల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపే లక్ష్యం

పుల్లలచెరువు: భూగర్భ జలాలు పెంపే లక్ష్యంగా గ్రామాల్లో ఉపాధి పనులు జరగాలని ఏపీవో మోషే అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం 100 రోజులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోప్‌పిట్స్ పూర్తి స్థాయిలో నిర్మించాలని చెప్పారు. ఉపాధి కూలీలకు తప్పని సరిగా రూ.250 నుంచి 300 వచ్చే విధంగా పనులు చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. క్షేత్ర సహాయకులు అశ్రద్ధ చేయకుండా అధికారుల ఆదేశాలు పాటించాలని చెప్పారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

మార్కాపురం: ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలు అనుమతి లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహించినా, లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని 5 ప్రైవేట్ ఆస్పత్రులను ఆమె ఒంగోలు డీఎంహెచ్‌ఓ కార్యాలయ ప్రతినిధి శ్రీనివాసరావుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఎంత ఒత్తిడి చేసినా లింగ నిర్ధారణ పరీక్షలు చేయవద్దని స్పష్టం చేశారు.

తాగునీరు వృథా


నీటిపైప్ లీకై బురదమయం

దర్శి (కురిచేడు): ప్రజలకు దాహార్తి తీర్చేందుకు ఎన్‌ఏపీ పథకం ద్వారా సరఫరా చేసే రక్షిత తాగునీరు పైపు లీకై నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారే లేరని ప్రజలు విమర్శిస్తున్నారు. దర్శి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో పైపుకు రంధ్రం ఏర్పడి నీరు వృథాగా పోతోంది. తహసీల్దార్ కార్యాలయం, పోలీసుస్టేషన్, సబ్‌జైలు కార్యాలయాలకు ప్రజలు నిత్యం పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాలు కూడా అటు ఇటు తిరుగుతుంటాయి. వాహనాలన్నీ నీరు నిల్వ ఉన్న గుంతలో నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. నీరు సరఫరా ఆగిపోయిన తర్వాత ఆ నీరు తిరిగి పైపుల్లోకి చేరి కలుషితమవుతోంది. మళ్లీ నీటి సరఫరా జరగగానే కలుషితమైన నీరు రక్షిత తాగునీటిలో కలిసి ట్యాపుల ద్వారా ప్రజలకు చేరి అంటువ్యాధులు ప్రబలుతాయని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే పైపు లీకుకు మరమ్మతులు చేసి ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

కౌంటర్ కేసుల నమోదు

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు గ్రామానికి చెందిన పోలంరెడ్డి వెంకటేశ్వరరెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదైంది. వెంకటేశ్వరరెడ్డి తనను కులం పేరుతో దూషించాడని బి.వీరయ్య అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి కూడా వీరయ్యపై ఫిర్యాదు చేశాడు. పరస్పర కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. వీరయ్య అనే వ్యక్తి గొర్రెలు మేపుకుంటూ రెండు నెలల క్రితం బొద్దికూరపాడు గ్రామానికి వలస వచ్చాడు. ఆ గొర్రెలు కంది పంటలో పడ్డాయంటూ తమను వెంకటేశ్వరరెడ్డి కులం పేరుతో దూషించినట్లు వీరయ్య తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. గ్రామానికి చెందిన పోలంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రాజేశ్వరిలు తమ కంది పంటలో వీరయ్య అనే వ్యక్తి తన గొర్రెల మందతో మేపించాడని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఇరువురిపై కౌంటర్ కేసులు నమోదు చేశారు. ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ కుమార్ ధర్మా రంగంలోకి దిగి వీరయ్యకు మద్దతుగా ఆందోళనకు దిగాడు. వీరికి ఎమ్మార్పీఎస్ నేత అనుపర్తి ఆదాం మద్దతు పలికాడు. కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.


దొనకొండ: తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల నిరసన

వెలుగొండకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి



కురిచేడు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు

కురిచేడు: పశ్చిమ ప్రకాశం ప్రజలకు అన్ని విధాలా ఉపయోగపడే పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పంటా ఏడుకొండలరెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఏడాది నీరు విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. మండలంలోని 6 గ్రామాల్లో 4 వేల ఎకరాల సాగు భూమికి పారుదల వెలుగొండ ప్రాజెక్టు డిజైన్‌లో ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడ్డ పశ్చిమ ప్రాంతానికి వెలుగొండతో సాగు,తాగు నీరు రావడంతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రజలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం జరుగుతుందని చెప్పారు. ప్రాజెక్టు శంకుస్థాపన చేసి 30 ఏళ్లయినా రాజకీయ పార్టీలు ప్రచారాస్త్రంగా ఉపయోగించుకుంటున్నాయే తప్ప నిధులు కేటాయించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించి ప్రాజెక్టు పూర్తి చేసి సాగునీరు, తాగునీరు విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రజనీకుమారికి వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు రైతు నాయకులు పి.రహంతుల్లా, తాండవ రంగారావు, చిరుపల్లి అంజయ్య, సుబ్బయ్య, శ్రీనివాసరావు, నాసరయ్య పాల్గొన్నారు.

దొనకొండ: దొనకొండ అభివృద్ధి చెందాలంటే వెలుగొండ ప్రాజెక్టే శరణ్యమని జిల్లా రైతు సంఘ నాయకులు తాండవ రంగారావు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు నాయకులు కర్నాటి వెంకట రామిరెడ్డి అధ్యక్షతన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత వెనుక బడిన పశ్చిమ ప్రకాశం జిల్లా ఆశాజ్యోతి పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించి మొదటి టన్నెల్ ద్వారా నీరు విడుదల చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తున్నట్లు గుర్తు చేశారు. దొనకొండ మండలంలో భూగర్భ జలాలు 400 నుంచి 700 అడుగులు లోతులో ఉండటంతో కరువు విలయ తాండవం చేస్తోందని, గ్రామాల్లోని ప్రజలు నిత్యం వలస పోతున్నారన్నారు. వెలుగొండ ప్రాజెక్టు నీరు విడుదల చేస్తే దొనకొండ అభివృద్ధి చెందుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాయ మాటలు చెప్పడం తప్పా వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో పని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం మండల నాయకులు చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ 19 గ్రామాల్లోని 17 వేల ఎకరాలు సాగు భూమికి పారుదల వెలుగొండ ప్రాజెక్టు డిజైన్‌లో ఉందని గుర్తు చేశారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తే వెలుగొండ ప్రాజెక్టు నీరు అందించవచ్చని, గతంలో ఇంజినీర్లు తెలిపారన్నారు. ఈ బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించి పూర్తి చేయాలని, లేకుంటే చలో అసెంబ్లీ పిలుపునిచ్చి పోరాడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు బోరెడ్డి వెంకటరామిరెడ్డి, మల్లవరపు బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు, వీరరాజు, కోటేశ్వరరావు, ప్రభుదాసు, తిరుపతయ్య, ప్రభాకర్, నరసింహారావు పాల్గొన్నారు.

నన్ను పట్టించుకోరూ?


తుప్పుపడుతున్న జనరేటర్

ముండ్లమూరు (కురిచేడు): ‘నన్ను మీరు బాగా చూసుకుంటే నేను కూడా మిమ్మల్ని అంతే బాగా చూసుకుంటా. ఏళ్లతరబడి నన్ను ఎవరూ పట్టించుకోవడం లేదు. నా అవయవాలన్నీ తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి. ఇకనైనా నన్ను కాస్త పట్టించుకోండి’ ఇది.. ముండ్లమూరు తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న జనరేటర్ ఆత్మకథ. జనరేటర్‌ను పట్టించుకోక పోవడంతో తుప్పుపట్టి పనికి రాకుండాపోతోంది. లక్షల రూపాయల విలువ చేసే జనరేటర్ పనికిరాకుండా పోయేలా చేస్తున్నారంటే అధికారులు ఎంత బాధ్యతగా పనిచేస్తున్నారో అర్థమవుతోంది. ఇప్పటికైనా అధికారులు జనరేటర్‌కు మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తేవాలని కార్యాలయానికి వచ్చే ప్రజలు కోరుతున్నారు.